# అంగడి వినోదం

ఆ రోజు ఉగాది. ఊరంతా సందడే. హైదరాబాదు నగరంలో అది మహారద్దీగా ఉండే ఓ రాజవీధి. ఆ ఉగాది రోజు ఆ వీధిలో ఓ బట్టల షాపు ప్రారంభోత్సవం. ముహూర్తం దగ్గరపడింది మొదలు షాపు యజమాని ఒకటే హడావుడి పడుతున్నాడు. పనివారికి అవసరం లేకపోయినా ఏదో ఒకటి పురమాయిస్తూనే ఉన్నాడు. వాళ్ళు కూడా యజమానితోపాటు మరింత హడావిడిగా అటు ఇటు తిరుగుతూ వారి బాధ్యత తెలియజేసుకుంటున్నారు.

'ఎందిరా! ఆ పారెట్ వేషగాడు వచ్చిండా! లేడా?'

యజమాని గద్దింపుకు భయపడ్డ మధ్యవర్తి అక్కడకు పరుగెత్తుకు వచ్చాడు.

"ఎప్పుడో వచ్చిండయ్యా! ఆడ నిలబడిండు" అన్నాడు చేత్తో అటు చూపిస్తూ!

అటు చూసిన యజమాని నిజంగానే ఆశ్చర్యపడ్డాడు.

"అబ్బో! నిజం పారెట్టులాగే ఉందే! ఇంక ఈ షాపులో కనక వర్షం కురవవలసిందే?" సంతృప్తిపడ్డాడు యజమాని.

పారెట్టు వేషం ధరించిన బుచ్చి తన వేషం చూసుకుని మురిసిపోతున్నాడు. పైగా ఆ షాపు ప్రారంభోత్సవమంతా తన మీదే ఉందని గర్వపడిపోతున్నాడు కూడా!

ఓ వారగా నిలబడిన మైసమ్మ కొడుకు వేషం చూసి తన కొడుక్కి గొప్ప అదృష్టం పట్టిందనుకుంది.

"ఎర్రని ముక్కుతో, పచ్చని రెక్కలతో సిలకమ్మ లెక్కనే కొడుతున్నావు బిడ్డా!" కొడుకు దగ్గరగా వెళ్ళి మెటికలు విరిచి మరీ వచ్చింది. చేతిలో యజమాని ఇచ్చిన ఎడ్వాన్సు 300 రూ. మైసమ్మకు వెయ్యి రూపాయల్లా అనిపించి మరోసారి లెక్క పెట్టుకుని చూసుకుంది. మొలనున్న గుడ్డ సంచీ తీసి అందులో ఆ డబ్బు పెట్టుకుంది. తిరిగి సంచీ మొల్లో పెట్టుకుంటూ మరోసారి చూసుకుంది.

"ఎన్నాళ్ళు పోగుసేత్తే ఇంత రొక్కం మిగులుతాది? బుచ్చిగాడికి ఇసువంటి ఏసాలె దొరకాలా?" అనుకుంది తమ అదృష్టానికి మురిసిపోతూ.

“బిడ్డా! అడ డబ్బా యెట్టినా! కూడు తినడం మరవబోక” అంటూ బుచ్చికి పదేపదే చెప్పింది. పొద్దుటే చద్దిగూడు తినిపించి అంబరుపేట నుంచి నడిపించుకుంటూ తీసుకొచ్చింది. బుచ్చి ఆకలికి తట్టుకోలేడు. అందుకే మైసమ్మ కొడుక్కి అన్నిసార్లు చెప్పింది.

“నే పోతున్నా బిడ్డా! కూడు తినడం మరవబోక! అదిగో! డబ్బా ఆడనే పెట్టినా బిడ్డా! కూడు తినడం మరవబోక!” అంటూ మైసమ్మ డబ్బావైపు చెయ్యి చూపిస్తూ చెప్పింది. వెనక్కి తిరిగి కొడుకు వైపే చూస్తూ మైసమ్మ తన పని మీద వెళ్ళిపోయింది.

‘‘రండీ! రండీ!’’ అంటు బుచ్చి మాటలు నేర్చిన రాచిలుక లాగే ముద్దుముద్దుగా పలుకుతూ రెండు చేతులతో అందరినీ ఆహ్వానిస్తున్నాడు. అతని పిలుపుకు ఆకర్షితులై చాలామంది రోడ్డు మీద ఆగిపోయి చూస్తున్నారు. కొంతమంది షాపు మెట్లు ఎక్కి చిలకను చుట్టుముడుతున్నారు. షాపు యజమాని ఆశించినట్లుగానే షాపు ముందు మహా సందడిగా ఉంది. అరగంట ఆలస్యంగా ముఖ్య అతిథి రానే వచ్చాడు. అరగంట పెద్ద ఆలస్యం కాదనుకున్న యజమానితో పాటు అందరు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్య అతిథి రిబ్బన్ కట్ చేసి అరగంటసేపు మాట్లాడాడు. యజమాని అందరికి టీ, బిస్కట్లు ఇప్పించాడు. కాని బుచ్చికి టీ నీళ్ళు కూడా ఎవరూ తాగమని ఇవ్వలేదు. నిజంగానే పారెట్టు అనుకున్నారు కాబోలు.

“ఈ చిలుకమ్మ మరింత బాగుందే?” అంటు ఆయన చిలమ్మ తల చేత్తో నిమిరాడు.

“అవునండీ! మీలాంటి వారికి నచ్చితే అందరికి నచ్చినట్టే?” అంటూ యజమాని ముసిముసి నవ్వులు నవ్వాడు. వారి మాటలు విన్న బుచ్చి మరింత సంబరపడి మరింత బాగా నటించడం మొదలుపెట్టాడు. ముఖ్య అతిథిగారు వెళ్ళగానే సేల్సు మరింత పెరిగాయి.

ఆ రోజు షాపులో కొన్నవాళ్ళకి 20% డిస్కౌంటు ఇస్తామని బయటపెట్టిన బోర్డు చూసి జనం విరగబడి మరీ కొంటున్నారు. పైగా అటుగా వెళ్ళేవారి పిల్లలు “మమ్మీ! డాడీ! అదిగో పెద్ద ప్యారెట్టు! ఆ షాపుకు వెడదాం!” అంటూ మారాం చేస్తున్నారు. అందుకు కొందరు ఆ షాపులోకి వెడుతున్నారు. తీరా షాపులోకి వెళ్ళాక పిల్లలు బట్టలు కొనకుండా వదులుతారా? అవసరం లేకపోయినా పిల్లల్ని తప్పించుకోలేకపోయినా ఆ మమ్మీ డాడీలు పిల్లలకి బట్టలు కొని మరీ వెడుతున్నారు.

కొందరు అమాయక చక్రవర్తులు నిజంగా అదేదో విదేశాల నుండి తెప్పించిన పెద్ద రాచిలకని విడ్డూరంగా చూస్తున్నారు. పైగా "అబ్బో యిట్టాంటి రాసిలకని జన్మలో సూడనేలేదు?" అంటూ షాపులోకి వెళ్ళి రాచిలక చుట్టు తిరుగుతున్నారు.

"ఇసువంటి సిలకలు అడవుల్లో ఉంటాయంట! మా నాయనమ్మ సెప్పేది. ఈటిని అడవి సిలకలంటారంట!" కొందరు అమాయకంగా అనుకుంటూ షాపులోకి చిలకమ్మను చూడ్డానికి బయలుదేరుతున్నారు. తీరా అటువంటి వాళ్ళు షాపులోకి వస్తే అమ్మే వాళ్ళు ఊరుకుంటారా? వారిని ఏదో విధంగా మభ్యపెట్టి బట్టలు కొనిపించి మరీ పంపిస్తున్నారు.

షాపులోకి అడుగుపెట్టిన వాళ్ళంతా వయసు భేదం లేకుండా అందరూ చిలకమ్మ చుట్టూ తిరుగుతున్నారు. బుచ్చి కూడా తన ప్రాధాన్యతకు మరింత మురిసిపోతున్నాడు. రెండు చేతులతో వారిని చుట్టుకొని వారి చుట్టూ తిరుగుతూ వారిని మరింత మురిపిస్తున్నాడు.

అప్పటికే లంచ్ టైం దాటిపోయింది. పనివారు ఒక్కొక్కరే వెనుకకు చాటుగా వెళ్ళి తెచ్చుకున్నదేదో తినేసి వస్తున్నారు. కాని బుచ్చి తిండి సంగతి ఎవరు పట్టించుకోలేదు. తల్లి ఇచ్చి వెళ్ళిన డబ్బా చూస్తుంటే బుచ్చికి కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. అందరివైపు దీనంగా చూస్తున్నాడు. అతని చూపుల్ని, అతని ఆకల్ని ఎవరు పట్టించుకోలేదు. ఎవరి పనులు వారు చేసుకుపోతున్నారు. మధ్యాహ్నం సూరీడు పడమటి వైపుకు వెళ్ళిపోతున్నాడు. ఓ పక్క దాహం! మరో పక్క ఆకలితో కడుపు నకనకలాడుతోంది. గాలికొట్టిన బంతిలా అంతవరకు మహా ఉత్సాహంతో ఎగిరెగిరిపడ్డ బుచ్చి క్రమంగా గాలి తీసిన బంతిలా ముడుచుకుపోయి నేలను కరుచుకుంటున్నాడు.

"రండి! రండి!" అంటూ అచ్చు రాచిలకలా ముద్దు ముద్దుగా పలికే బుచ్చి మాటలు ముద్ద ముద్దగా వస్తున్నాయి. అందరిని ప్రేమగా ఆహ్వానించే చేతులు పక్షవాతం వచ్చినట్లుగా కిందకు వాలిపోతున్నాయి. చేతులు పైకి ఎత్తడం బుచ్చితరం కావడం లేదు. అతని శరీరం అతని స్వాధీనం తప్పిపోతోంది.

బుచ్చితోపాటే అతని బస్తీ నుండి వచ్చిన యాదికి అప్పుడు బుచ్చి సంగతి గుర్తుకొచ్చి ఉలిక్కిపడ్డాడు.

"అయ్యో! బుచ్చి ఏమీ తిననే లేదు! ఆడికి జర ఆకలి కూడా ఎక్కువే!" అనుకుంటు బుచ్చి దగ్గరకు కంగారుగా వచ్చాడు.

ఎవరు చూడకుండా బుచ్చిని పిలిచి మంచినీళ్ళగ్లాసు అందించాడు. బుచ్చి గ్లాసుడు నీళ్ళు గటగటా తాగేసి మరో గ్లాసుడు నీళ్ళు అడిగి పుచ్చుకుని అవీ తాగేసాడు. యాదికి గుండె చెరువయింది. ఎవరో తాగకుండా వదిలేసిన చల్లని టీ గ్లాసు పక్కనే ఉంటే బుచ్చికి అందించాడు. ఆ చల్లటి టీ ఒక్క గుక్కలో తాగేసి పనికిరాని ఆ ప్లాస్టిక్ గ్లాస్ పక్కనే పడేసాడు. యజమాని చూస్తే తిడతాడని యాది టిఫెన్ డబ్బాలో అన్నం తినమని చెప్పలేకపోయాడు. బుచ్చి కూడా అదే భయంతో ఎదురుగా సిద్ధంగా ఉన్న అన్నం తినలేక తిరిగి యధాస్థలంలోకి వెళ్ళి నిలబడ్డానికి ప్రయత్నించాడు. కాని నిలబడలేకపోతున్నాడు. బుచ్చి బాధతో మెలికలు తిరిగాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఓ యమ్మా! నా కాళ్ళు నొప్పి పెడుతున్నవే! నే ఈడ నిలబడలేకనే?" అంటూ సన్నగా మూలుగుతూ ఏడవడం మొదలుపెట్టాడు. ఆ మూలుగు ఎవరికీ వినబడలేదు. అతని ఏడుపు ఎవరి కంట పడలేదు. యాదికి అతని గుండెచప్పుడు తెలుసు. అయినా అక్కడ ఏమీ చెయ్యలేడు. అక్కడ అందరినీ ఆకర్షించేది బుచ్చి వంటి మీది ఆ చిలక తొడుగు మాత్రమే. ఉదయం 9 గం. ఆ వేషం తగిలించుకుని నిలబడ్డ బుచ్చి అలాగే నిలబడి ఉన్నాడు. సాయంకాలం 6. గం.లు దాటింది. చీకటిపడి 7 గం.లు దాటింది. విద్యుద్దీపాల కాంతిలో ఆ షాపు మరింత ధగధగలాడుతోంది. అమ్మకాలు మరింత పెరిగి మరింత రద్దీగా ఉంది. కాష్ కౌంటర్ దగ్గర నిలబడి యజమాని ఆ రోజు కలక్షన్ చూసుకుని తన అదృష్టానికి మురిసిపోతున్నాడు. తన ఆకలి బాధను నోరు విప్పి చెప్పుకోలేని బుచ్చి చివరకు నేలకొరిగిపోయాడు.

"అయ్యో! బుచ్చి పడిపోయిండు!" అంటూ యాది కంగారుగా యజమాని దగ్గరకు పరుగెత్తాడు.

"ఏందిరా! కొంపలు మునిగినట్టు ఆ అరుపేంటిరా! ఎళ్లి కాసిని నీళ్ళు తాగిపించు!" అన్నాడు కోపంగా యజమాని. ఏమీ చెయ్యలేని యాది తిరిగి బుచ్చి దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

ఎవరో సాయం చేస్తే యాది అతన్ని ఓ వారగా తీసుకొచ్చి పడుకోపెట్టాడు. ఒకతను వచ్చి ఆ చిలక తొడుగు విప్పి పక్కన పెట్టాడు. యాది గ్లాసుతో నీళ్ళు జల్లి తాగించడానికి ప్రయత్నించాడు. బుచ్చి కదల్లేదు. నీళ్ళు తాగడానికి అతని నోరు తెరుచుకోలేదు. యాదికి ఏడుపొచ్చేసింది.

"బుచ్చీ! బుచ్చీ!" అంటూ అతన్ని కుదుపుతూ భయంతో వెక్కి వెక్కి ఏడ్చాడు.

కొడుకుని తన వెంట తీసుకుపోదామని వచ్చిన మైసమ్మ ఆ దృశ్యం చూసింది. నేలమీద చలనం లేకుండా పడున్న కొడుకుని చూసి గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ కొడుకు పక్కనే చతికిలబడింది.

పొద్దున తానిచ్చిపోయిన టిఫిన్ డబ్బా వెక్కిరిస్తూ కనబడింది. బుచ్చి ఆ డబ్బాలోని కూడు తినలేదని అర్థం చేసుకుంది. "ఓ యజమానయ్యా! నా కొడుకును పొట్టన పెట్టుకున్నావు కదయ్యా!". కొడుకు ఒళ్ళు చేత్తో నిమురుతూ గుండెలు పగిలేలా మరింత ఏడ్చింది. బుచ్చి శరీరంలో ప్రాణముందో లేదో కూడా ఆ తల్లికి తెలియలేదు.

యజమాని రాతి గుండె మాత్రం కరగలేదు. డబ్బు ఇంకా లెక్కపెట్టుకుంటూనే ఉన్నాడు. అప్పటికే రోడ్డు మీద జనం పలచబడ్డారు. షాపులు మూసే సమయం అయింది. అటుగా వెడుతున్న ఓ ఇద్దరు మైసమ్మ ఏడుపు విని షాపులోకి వచ్చారు.

"ఉండవమ్మా!" అంటూ మైసమ్మను పక్కకు నెట్టారు. బుచ్చి ముక్కు దగ్గర వేలు పెట్టి చూసారు. ఊపిరి కదులుతూనే ఉంది. "ఏంటమ్మా! ఆ ఏడుపేటి? గుండెలు బాదుకుని ఏడిస్తే పిల్లాడు బతుకుతాడా? అస్పటాలికి తీసుకెళ్ళాలా? నడునడు" అంటు ఆ తల్లిని తొందర చేసారు. తరువాత వాళ్ళు యజమాని దగ్గరకు వెళ్ళారు.

"ఏమయ్యా! నువ్వేనా యజమానివి? పిల్లగాడు తెలివితప్పి పడిపోతే అలా చూస్తూ కూర్చున్నావేమయ్యా! ముందు ఆమెకి డబ్బిచ్చి ఆస్పతాలికి పంపించు" అంటూ గదమాయించారు. యజమానిని బుచ్చి విషయం అడగడానికి భయపడిన పనివారంతా నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తున్నారు. "ఇంకా జనం వచ్చి మీదపడిన ప్రమాదమే? పైగా పోలీసులు చూస్తే మరీ ప్రమాదం! జేబులు ఖాళీ చేస్తే కాని వదిలిపెట్టరు? వచ్చిన లాభం వదిలిపోతుంది? వీరిని వదిలించుకోవడమే మంచిది?" అని ఆలోచించుకున్నాడు యజమాని. వెంటనే కౌంటర్ బాక్స్‌లో నుంచి ఓ వంద నోటు తీసి ఆమె చేతిలో పెట్టబోయాడు. "ఆ వందే మూలకయ్యా! ఓ ఇంజక్షనిస్తే చాలదు? ముందు డబ్బు తియ్యి?" అంటూ మరోమారు గద్దించాడు ఆ ఇద్దరిలో ఒకడు. "వారి నుంచి తప్పించుకోలేమని తెలుసుకున్న యజమాని మరో రెండు వంద నోట్లు తీసి మైసమ్మ చేతిలో పెట్టాడు.

పైగా "జల్దీ అస్పటల్‌కి తీసుకెళ్ళవమ్మా!" అంటూ తొందరపెట్టాడు. అక్కడ నుంచి ఆ బుచ్చిగాడిని ఎంత తొందరగా తీసుకువెడితే అంత మంచిదని అతని

ఉద్దేశం. వాడు ఇటో అటో అయితే మరీ ప్రమాదమని ఆ యజమాని అసలు భయం. బుచ్చి బతుకు ఏమవుతుందోనని తోటి పనివారంతా నిజంగానే భయపడ్డారు. బుచ్చిని సాయంపట్టి బయటకు తీసుకువచ్చారు. ఆ కొత్త వ్యక్తుల్లో ఒకడు ఆటో మాట్లాడి అక్కడికి దగ్గరలో ఉన్న ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపొమ్మన్నారు. అందరితోపాటు అతను కూడా ఓ చెయ్యి వేసి బుచ్చిని ఆటోలో పడుకోపెట్టాడు. మైసమ్మ బుచ్చి తల తన వళ్ళో పెట్టుకుని ఆటోలో కూర్చుంది. యాది కూడా ఆటో ఎక్కి బుచ్చి కాళ్ళవైపు కింద కూర్చున్నాడు.

"పొద్దుటి 300 రూపాయలున్నాయి. ఇప్పుడీ మరో మూడొందలు! ఈడిని కాపాడుకోడానికి చాలు!" కారే కన్నీళ్ళు తుడుచుకుంటూ మైసమ్మ ఆలోచించుకుంది.

"మీవల్లే నా బిడ్డని కాపాడుకోగలిగా! నా బిడ్డని రచ్చించావు బాబూ!" అంటూ మైసమ్మ ఇంకా అక్కడే నిలబడ్డ ఆ వ్యక్తికి చేతులు జోడించి దండాలు పెట్టింది.

"ఏదీ ఎన్నొందలిచ్చిండు? సూపీ?" అని ఆ వ్యక్తి అనగానే మైసమ్మ డబ్బు దాచిన గుప్పిడి విప్పి చూపించింది. కోడిపిల్లను తన్నుకుపోయే డేగలా అతను తన చేతిలో డబ్బు తన్నుకుపోతాడని ఆమెకు తెలియలేదు.

"యజమాని చేత కక్కించిన డబ్బంతా నీకోసం కాదు?" అంటూ అతను ఆమె చేతిలోని రెండు వందల నోట్లు ఠక్కున అందుకున్నాడు. వచ్చిన పని పూర్తయిందని కాబోలు మరో వ్యక్తితో కలిసి పక్కకు జారుకున్నాడు. మైసమ్మ గుండె కాసేపు చలనం లేకుండా పోయింది. ఆటో ఒక్కసారి కదలగానే గుండె కదిలి తిరిగి ఆమె ఈ లోకంలోకి వచ్చింది. అది కలో నిజమో తెలీక ఆమె చేతిలోని నోటువైపు చూసుకుంది. ఒక వంద నోటే జాలిగా చూస్తూ కనబడింది.

అది కలకాదు! నిజమే? అని నిర్ధారించుకుంది. "ఈ లోకం పాడైపోనాది అంటారు! ఇదే కాబోలు! ఏదైనా నా బిడ్డను కాపాడుకోవాల! ఆడు బతకాల?" అనుకున్న మైసమ్మ జర త్వరగా పోనీ! బాబూ!" అంటూ ఆటో డ్రైవర్ని తొందరచేసింది. ఆటో మరింత వేగం పుంజుకుంది. అవేమి తెలియని యాది బుచ్చివైపు జాలిగా చూసాడు.

14 సంవత్సరాల కొడుకు పదేళ్ళ పిల్లగాడిలా వళ్ళో ముడుచుకుపోయి పడుకున్నాడు. కొడుకు వైపు చూడగానే ఆమె దుఃఖం సుడులు తిరిగింది.

"ఇంకెప్పుడు డబ్బు కోసం పిల్లగాడిని అమ్ముకోకూడదు! ఈడు ఇంత డబ్బు తన్నుకుపోయింది. ఈ మధ్యవర్తి గాడికి ఎంత దక్కిందో" అనుకున్న మైసమ్మకు

మరింత బాధ కలిగింది. కొడుకు ఒళ్ళంతా ఆప్యాయంగా నిమురుతుంటే ఆమె కన్నీళ్ళతో బుచ్చి శరీరం తడిసిపోయింది.

అంగడి వినోదం తన బతుకులో అంత విషాదం నింపుతుందని ఆమె అనుకోలేదు. చేతిలో డబ్బు చాలకపోయినా అప్పు చేసైనా కొడుకును బతికించుకోవాలనుకుంది.

ఆటో హాస్పటల్ ముందు ఆగగానే మైసమ్మ ఊపిరి పీల్చుకుంది. కొడుకు ఊపిరి కదులుతోందని తెలుసుకుంది. లేని బలం తెచ్చుకుని బుచ్చిని భుజాన వేసుకుని హాస్పటల్లోకి పరుగెత్తింది. యాది ఆమె వెంట పరుగెత్తాడు.

*ఆకాశవాణి సౌజన్యంతో*

*2003 ఏప్రిల్ - ఉగాది ప్రత్యేక సంచిక. పత్రిక-మాస పత్రిక*